బాలమిత్ర

- వాసంతి మాఘపు.

## గుమ్మడికాయ - పువ్వులు

పూర్వము ఒక రాజు తన రాజ్యమును ఎంతో సమర్థవంతముగా పరిపాలించుచుండెను. ప్రజలంతా రాజుగారి పరిపాలనలో ఎంతో ఆనందముగా జీవితములు సాగించుచుండిరి. రాజుగారు తన పరిపాలన గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోగోరి ఒకరోజు మారువేషములో పురవీధులలో తిరుగుతూ, గుంపుగా కొంతమంది ఏదో మాట్లాడుకుంటుండం గమనించి, వారి చెంతకు వెళ్ళి వారు ఏమి మాట్లాడుకుంటున్నారో వినసాగారు. వారిలో ఒకవ్యక్తి "మనము చాలా అదృష్టవంతులం. దేవుని దయవలన మనము ఎన్నో సౌకర్యములను అనుభవిస్తూ, సుఖంగా ఉండగలుగుతున్నాం." అన్నాడు.

రాజుగారు మరికొంత దూరం వెళ్ళి, మరొక గుంపు మాట్లాడుకోవడం చూసి, వారేమి మాట్లాడుతున్నారో వినసాగారు. ఆ గుంపులోనొకడు "మనమీరోజు ఇంత సుఖముగా, ఆనందముగా ఉన్నామంటే అది మన రాజుగారివలనే. ఇలాంటి రాజుగారి పాలనలో జీవించడం మన అదృష్టం." అన్నాడు.
తరువాత రాజుగారు తన మందిరం చేరుకుని, ప్రజలు తనగురించి గొప్పగా చెప్పుకోవడాన్ని గురించి ఆలోచిస్తూ, ఎంతో సంతోషముతో వారిరువురికి ఏదైనా బహుమతి పంపవలెనని నిర్ణయం తీసుకున్నారు.

మరుసటి దినమున రాజుగారు తనను పొగిడినవానికి ఒక గుమ్మడికాయను కోసి, అందులో బంగారు నాణెములను నింపి, మళ్ళీ గుమ్మడికాయను కోసిన ఆనవాలు లేకుండా చక్కగా అతికించి పంపిచారు. భగవంతుని పొగిడినవానికి ఒక బుట్ట నిండుగా పువ్వులను పంపించారు. రాజుగారిని పొగిడిన వ్యక్తి రాజుగారు కానుకను పంపించారని తెలిసి చాల ఆనందించాడు. కాని అంత పెద్ద గుమ్మడికాయను ఏమిచేయాలో తెలియలేదు. కావున తనకు తెలిసిన పూలు అమ్ముకునే ఆసామికి ఇచ్చి "దీనిని రాజుగారు పంపించారు. నేను గుమ్మడికాయను తినను. ఎవరైనా దీనిని ఇష్టంగా తినేవారికి ఇస్తే బాగుంటుందని అనుకోగానే నీవు గుర్తుకొచ్చావు. దీనిని తీసికొమ్మ"ని అతనికి అందించాడు. ఆ గుమ్మడికాయను తీసికొని తను పువ్వులను అమ్ముకోడానికి వెళ్ళిపోయాడు ఆ పువ్వుల వర్తకుడు.

రాజుగారు పంపిన పూలబుట్టను అందుకున్న 'భగవంతుని పొగిడిన వ్యక్తి' ఆ బహుమతిని ఆనందముతో భగవంతుని అనుగ్రహముగా స్వీకరించి, కొన్ని పువ్వులను పూజకు వినియోగించి, మిగిలిన పూలను పూలవర్తకునికి ఇస్తే, అతడు దాని ఆధారముగా కొంత సొమ్మును సంపాదించికోగలడని తలచి, అతనికి అందజేసెను. పూలవర్తకుడు ఆనందముగా తనకు 'రాజుగారిని పొగిడిన వ్యక్తి' ద్వారా సంక్రమించిన గుమ్మడికాయను 'భగవంతుని పొగిడిన వ్యక్తి'కి ఇచ్చివేసెను. ఆ వ్యక్తి ఇంటికి వచ్చి ఆ గుమ్మడికాయను కోయగా అందుండి నూరు బంగారు నాణెములు బయటపడెను. భగవత్ప్రసాదముగా భావించి, అతడా ధనమును సత్కార్యములకై వెచ్చించెను.

భగవంతుడు తన భక్తులను అనుక్షణమూ గమనిస్తూ ఉంటాడు. 'భగవంతుని పొగిడిన వ్యక్తి'కి బంగారు నాణెములు నింపిన గుమ్మడికాయను ఇవ్వాలని రాజుగారికి ఏ కొసానా లేదు. కాని, భగవంతుని ఆలోచన వేరే విధముగా ఉన్నది. అన్ని కార్యములు ఆ భగవంతుని సంకల్పమునననుసరించియే జరుగుతున్నవి.

***దీనివలన నేర్చుకున్న నీతి ఏమిటి?***

చాలా సందర్భములలో మనమే ఈ విశ్వమును పాలిస్తున్నామని భ్రమ పడుతుంటాము. కాని, మన ఊహలకి విరుద్ధముగా సంఘటనలు జరుగుతున్నప్పుడు - మనను నడిపిస్తున్న ఏదో అతీతమైన శక్తి ఉన్నదని అవగతమౌతుంది. అదే దివ్యశక్తి. ఆ దివ్యశక్తి ఆదేశాన్ని అనుసరించడమే మన ధర్మము. మన గమనములో మనకు తారసపడే కష్టసుఖాలు, దు:ఖము, ఆనందము, గెలుపు, ఓటములు అన్నీ భగవంతుని ఆశీర్వాదముగా భావించి స్వీకరించాలి.

*